క్లుప్తంగా

బీజేవైఎం మండల అధ్యక్షుడి నియామకం

నవీపేట: బీజేవైఎం మండల అధ్యక్షుడిగా బండారి రాజశేఖర్‌ను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డి మోహన్‌రెడ్డి, మేడపాటి ప్రకాశ్‌రెడ్డి నియామకపత్రాన్ని ఆదివారం అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని అన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తామని వెల్లడించారు.

హనుమాన్ ఆలయంలో శ్రమదానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం రెండు గంటలు అనే నినాదంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం కొనసాగుతోంది. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కాలనీలోని భక్త హనుమాన్ ఆలయ ప్రాంగణ పరిసరాల్లో శ్రమదానం చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్ కుమార్, సత్యనారాయణ గౌడ్, సుంకె శ్రీనివాస్, కొక్కెర భూమన్న, కొంతం రాజు, సాయన్న, ఎర్ర భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈద్ మిలాన్ సమావేశం

ఆర్మూర్‌టౌన్: రంజాన్ మాసంలో దివ్య ఖురాన్ సర్వమానవాళి కోసం అవతరించిందని జామతే ఇస్లామి హింద్ జిల్లా సభ్యుడు షేక్ హుస్సేన్ అన్నారు. పట్టణ కేంద్రంలో ఆదివారం జామతే ఇస్లామి హింద్ ఆర్మూర్ ఆధ్వర్యంలో ఈద్ మిలాన్ సమావేశం నిర్వహించారు. గత 80 ఏళ్లుగా సమాజంలో శాంతి, సోదరభావానికి ప్రయత్నం చేస్తున్న ధార్మిక సామాజిక సంస్థ అన్నారు. కార్యక్రమంలో జామతే ఇస్లామి పట్టణ అధ్యక్షుడు అస్లాం, జహీర్‌హుద్దీన్, హమద్‌అలీ, మూగ ప్రభాకర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి ఆహ్వానం

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో శ్రీ అనంత ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 23న హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు వీడీసీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వేడుకలకు హాజరు కావాలని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డికి వీడీసీ సభ్యులు ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల రాము, వీడీసీ సభ్యులు రవి, సాజిద్, రాజేశ్వర్, భూపేందర్, శ్రీధర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



పెర్కిట్: పెర్కిట్‌లో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు సాహెబ్ గారి దేవేందర్, కోశాధికారి రాజు బాబు, దేవేందర్, కాంగ్రెస్ నాయకుడు అయ్యప్ప శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు మానేటి లింబాద్రి, మూడ అశోక్, శేఖర్ రెడ్డి, బుజ్జి రెడ్డి, చిట్టి రెడ్డి, కొంతం మురళీధర్, దాసరి అనిల్, నటరాజ్, మల్కన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే చిత్తడి



మోర్తాడ్: చిన్నపాటి వర్షానికే పలు రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. ఏర్గట్ల మండల కేంద్రం నుంచి జగిత్యాల్ జిల్లా ఇబ్రహీంపట్నం వెళ్లే రోడ్డు మార్గం ఇటీవల కురిసిన వర్షానికి చిత్తడిగా మారింది. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో గుంతలు ఏర్పడి నీరు నిలుస్తోంది. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తాగునీటి సరఫరాకు పక్కా ప్రణాళిక

- లీకేజీలను అరికట్టే దిశగా అడుగులు
- రూ. 32 లక్షలతో మరమ్మతు పనులు



శక్కర్‌నగర్‌లో పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్



బెల్లాల్ చెరువు

బోధన్‌టౌన్: వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ప్రణాళికతో తాగునీటిని సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఆ దిశగా బోధన్ మున్సిపల్ యంత్రాంగం పట్టణ ప్రజల తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతోంది. పైప్‌లైన్ లీకేజీలతో నీరు వృథా పోకుండా పలు కట్టుదిట్టమైన చర్యలను చేపడుతోంది. బోధన్ మున్సిపల్ పరిధిలో 38 వార్డులు, 17,500 నివాసాలు, 12 వేలకు పైగా తాగునీటి కుళాయిలు ఉన్నాయి. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు బల్దియా ఆధ్వర్యంలో ప్రతీ రోజు 15 ఎంఎల్‌డీ(39లక్షల61వేల గ్యాలన్ల) నీటిని సరఫరా చేస్తున్నారు.

బెల్లాల్ చెరువుతో..

బోధన్ మున్సిపల్‌లోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు బల్దియా అధికారులు బెల్లాల్ చెరువును వినియోగిస్తున్నారు. ఈ చెరువు సామర్థ్యం 12 అడుగులు ఉండగా ప్రస్తుతం చెరువులో 9.11 అడుగుల నీరు ఉంది. ఈ చెరువు నుంచి నీటిని పట్టణంలోని రాకాసీపేట్‌లో ఉన్న వాటర్ వర్క్స్‌కు పైప్‌లైన్ల ద్వారా తీసుకొచ్చి శుద్ధి చేసి ప్రజలకు ప్రతి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. రాకాసీపేట్, శక్కర్‌నగర్, బోధన్, ఆయన్‌పల్లి, ఎల్‌బీఎస్ నగర్ కాలనీల్లో 10 వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ట్యాంకుల ద్వారా ప్రతీరోజు నీటి సరఫరాను చేస్తుంటారు.

ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారింపు

వేసవిలో రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం సూచించడంతో పాటు 15 రోజుల క్రితం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి పట్టణ ప్రజల తాగునీటి వనరు బెల్లాల్ చెరువును పరిశీలించారు. చెరువులో నీటి నిల్వ 6.5 అడుగులు ఉన్నాయని అధికారులు తెలుపగా జూన్ నెలాఖరు వరకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు నిజాంసాగర్ నీటిని విడుదల చేయించి చెరువులో నీటి నిల్వను 9.5 అడుగులకు చేర్చారు.

కంట్రోల్ రూం ఏర్పాటు..

పట్టణ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు బల్దియా కార్యాలయంలో అధికారులు కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. పట్టణంలో ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు. సమస్య పరిష్కారం దిశగా అడుగులు ముందుకు సాగుతున్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తాం

పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. ఇప్పటికే తాగునీరు వృథా పోకుండా లీకేజీల మరమ్మతులను చేపడుతున్నాం. తాగునీటి సమస్యల పరిష్కారానికి కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశాం.

– వెంకటనారాయణ, మున్సిపల్ కమిషనర్

తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు..

వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు 15వ ఆర్థిక సంఘంలో సమ్మర్ ఆక్షన్ ప్లాన్ కోసం రూ. 32 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో తాగునీటి లీకేజీలు, బోర్ల మరమ్మతులు, లేబర్ ఎంగేజ్, లీకేజీల మెటీరియల్ తోపాటు తాగునీటికి సంబంధించిన మిషన్‌ల మరమ్మతుల కోసం నిధులు ఖర్చు చేయాలని సూచించింది. దీంతో బల్దియా అధికారులు పట్టణంలోని 38 వార్డుల్లో 70 తాగునీటి లీకేజీల ద్వారా ప్రతిరోజు మొత్తం నీటి సరఫరాలో 6 శాతం తాగు నీరు వృథాగా పోతుంటాయి. వేసవిలో తాగునీటి ఎద్దడిని అరికట్టి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పట్టణంలోని 70 లీకేజీలను మరమ్మతులు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయడానికి 20 మంది లేబర్స్‌లను ఎంగేజ్ చేసుకొని లీకేజీ పనులకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేస్తోంది. ఇప్పటి వరకు రూ. 17లక్షల50వేల వరకు ఖర్చు చేసి 15 పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టారు. మిగిలిన పైప్‌లైన్ లీకేజీలను మరమ్మతులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకొని ముందుకు సాగుతున్నారు.

కాంగ్రెస్‌వి నీచ రాజకీయాలు



పెర్కిట్: హిందు దేవుళ్లు, సనాతన హిందు ధర్మంపై నీచ రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులుండవని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిత్తరంజన్ రెడ్డి అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒకరు హిందు దేవుళ్లను అసభ్యకరంగా చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకు నిరసనగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఆదివారం అతని దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సందగిరి రాజశేఖర్ రెడ్డి, నాగ సురేష్, సంతోష్, గిరీష్, గంగోళ్ల ప్రశయ్‌తేజ్, రాథోడ్ రాజశేఖర్, కంటం సాయి, నడిసరం మల్లయ్య పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియం బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా గజ్జల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మద్దికుంట సజ్జన్‌కుమార్, ఈగ శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా రెంజెర్ల మహేందర్‌రెడ్డి, కార్యదర్శిగా సామ నగేశ్‌రెడ్డి, కోశాధికారిగా అచ్చ విజయ్ భాస్కర్, సలహాదారులుగా గుండోజీ భరద్వాజ్, సుమన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో చింత శ్రీకుమార్, నగేశ్, సాబార్ కిషన్, గుజ్యేటి రవి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు బిల్లులు ఇప్పించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి

వర్ని: డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట వచ్చిన బిల్లులను కాజేసిన బీఆర్ఎస్ నేతల నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి లబ్ధిదారులకు బిల్లులు ఇప్పించాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో శ్రీనివాస్‌రెడ్డి మొసలి కన్నీరు కారుస్తూ లబ్ధిదారులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బెడ్ రూమ్ ఇండ్లలో జరిగిన అవినీతిని ప్రభుత్వ పరంగా వెలికి తీసి లబ్ధిదారులకు బిల్లులు ఇప్పిస్తామని అన్నారు. రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎలమంచిలి శ్రీనివాసరావు, నాయకులు మేక వీర్రాజు, బజ్జ నాయక్, కూనిపూర్ రాజిరెడ్డి, విండో డైరెక్టర్ పైడిమల్ శంకర్, మోహిన్, గంగప్ప, హర్షవర్ధన్, రాంబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు



సునీల్‌రెడ్డితో రామన్నపేట్ గ్రామస్తులు



కాంగ్రెస్‌లో చేరుతున్న బోదేపల్లి వాసులు

వేల్పూర్/ బాల్కొండ/ మోర్తాడ్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ మండలం రామన్నపేట్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు శోభన్, నవీన్, ఎర్రన్న, రాజేశ్, సాయిలు, రాజు, వినీత్, గ్రామస్తులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి సునీల్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మోహన్, భూమారెడ్డి, సురేశ్, నాయకులు పాల్గొన్నారు. బాల్కొండ మండలం బోదేపల్లికి పలువురు నాయకులు, గ్రామస్తులు సునీల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. మోర్తాడ్‌లోని ప్రజా నిలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి సమక్షంలో ఏర్గట్ల ముదిరాజ్, ఒడ్డెర సంఘాల సభ్యులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ పాల్గొన్నారు.



సునీల్‌రెడ్డితో ఏర్గట్ల వాసులు

ఆధ్యాత్మికం..

■ **కొనసాగుతున్న శివనామ సప్తాహం**



బోధన్‌రూరల్: వీరశైవ సమాజ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయంలో 19వ అఖండ శివనామ సప్తాహం కొనసాగుతోంది. రెండో రోజైన ఆదివారం ఆలయంలోని శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి శివనామ సప్తాహం ప్రారంభించారు. కార్యక్రమానికి 108 షటస్థల బ్రహ్మ రాజశేఖర్ గురు లింగ శివాచార్య స్వామీజీ, అహ్మద్‌పూర్ పీఠాధిపతులు విచ్చేసి ప్రవచనం చేశారు. మనిషి మనుగడకు ఆధ్యాత్మికం, వైజ్ఞానికం అవసరమని అన్నారు. అలాగే పురాణే మత నిర్వాహకుడు పురాణే అజయ్ కుమార్ ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో వీరశైవ సమాజ్ ప్రతినిధులు శంకరప్ప, రాజేశ్వర్ పటేల్, అజయ్ కుమార్, విఠలప్ప, యాదవ్ రావు, ప్రభు అప్ప, శివ, చెన్నప్ప, నితిన్, దిలీప్ కుమార్, రాజు, శివకుమార్, ప్రముఖులు పాల్గొన్నారు.

■ **26 నుంచి రేణుకాఎల్లమ్మ కల్యాణ ఉత్సవాలు**

ఎడపల్లి: మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలను ఈ నెల 26 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు ఎడపల్లి కైండిన్య గౌడ సంఘం నాయకులు తెలిపారు. ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలయాల్లో ప్రతి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కల్యాణ మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.ఎల్లా గౌడ్, పుట్ట నరస గౌడ్, కె మల్లాగౌడ్, నటరాజ్ గౌడ్, కేసరి రవి గౌడ్, పుట్ట అశోక్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, ఆర్ స్వామి గౌడ్, వంగ వెంకట్, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

■ **బ్రహ్మోత్సవాలు ప్రారంభం**



బోధన్‌రూరల్: పట్టణంలోని మారుతి మందిరంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలు మూడు రోజులు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ప్రవీణ్ మహరాజ్ తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

సర్కారు బడులు బలోపేతం..

- మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు
- డొంకేశ్వర్ మండలానికి రూ.60.20 లక్షలు మంజూరు
- పదహారు స్కూళ్లలో పనులు గుర్తించిన అధికారులు



డొంకేశ్వర్ మండలం చిన్నయానం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

డొంకేశ్వర్: ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పించడానికి ప్రత్యేక నిధులను కేటాయించింది. ఇందుకు డొంకేశ్వర్ మండలానికి రూ.60.20లక్షల నిధులు మంజూరయ్యాయి. ఐతే, పాఠశాలల్లో పనులను ముందుగానే గుర్తించిన సంబంధిత అధికారులు పనులు ప్రారంభించడానికి కసరత్తును వేగవంతం చేశారు. మండలంలో మొత్తం 16 స్కూళ్లకు నిధులు మంజూరు కాగా, ఇందులో 12 ప్రాథమిక పాఠశాలలు, నాలుగు ఉన్నత పాఠశాలలున్నాయి. అత్యధికంగా సిర్పూర్ ప్రైమరీ స్కూల్‌కి రూ.10.70లక్షలు, గాదేపల్లి జడ్పీ హైస్కూల్‌కి రూ.8.95లక్షలు, మారంపల్లి ప్రైమరీ స్కూల్‌కి రూ.6.45లక్షలు మంజూరయ్యాయి. మిగతా పాఠశాలలకు రూ. లక్ష నుంచి రూ. నాలుగున్నర లక్షల వరకు నిధులు వచ్చాయి. ఈ నిధులతో బడుల్లో తాగునీరు, ఎలక్ట్రిసిటీ, ఫ్యాన్లు, కొత్త టాయిలెట్ల నిర్మాణాలు, కిటికీలు, తలుపుల బిగింపు, తరగతి గదులకు మరమ్మతులు, ఇతర పనులు చేపట్టనున్నారు. ఈ పనులు వెంటనే ప్రారంభించి రానున్న విద్యా సంవత్సరం నాటికి (జూన్ 10లోపు) పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నాయి. పనులు సక్రమంగా చేపడితే వసతులు మెరుగై ప్రభుత్వ పాఠశాలలు మహర్దశకు చేరుకోనున్నాయి. తద్వారా స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు..

ప్రభుత్వ స్కూళ్లలో వసతుల కల్పనకు ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ' కార్యక్రమం పేరుతో నిధులను మంజూరు చేసింది. పనులను పర్యవేక్షించడానికి ఈ కమిటీ పని చేయనుంది. కమిటీలో మొత్తం 15–17 మంది సభ్యులుంటారు. కమిటీ చైర్మన్‌గా గ్రామ సంఘం అధ్యక్షురాలు, పాఠశాల హెడ్ మాస్టర్ కన్వీనర్‌గా ఉంటారు. అలాగే ప్రతీ తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లులు మెంబర్లుగా ఉంటారు. కమిటీలను సత్వరమే ఏర్పాటు చేసిన అధికారులు బ్యాంకు ఖాతాలను తెరిపించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఇదే ఖాతాలో జమ అవుతాయి. పనులే కాకుండా స్కూళ్లలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా 'అమ్మ ఆదర్శ కమిటీ'నే బాధ్యత తీసుకుంటుంది. పిల్లలకు విద్యాబోధన సక్రమంగా అందే విషయంలో కూడా కమిటీ కీలకంగా వ్యవహరిస్తుంది.

జూన్ నాటికి పూర్తి చేస్తాం



ప్రభుత్వ బడుల్లో వసతులు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో స్కూళ్లల్లో అన్ని రకాల సదుపాయాలు అందుబాటులోకి తెస్తాం. అమ్మ ఆదర్శ కమిటీల పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతాయి. కాంట్రాక్టర్లతో జూన్ నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్ రెడ్డి, ఎంఈవో

అధ్వానంగా తారు రోడ్డు

- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



గుంతల మయంగా మారిన రోడ్డు

బాల్కొండ: ముప్కాల్ నుంచి మెండోరా మండల కేంద్రం వరకు నిర్మించిన తారు రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు మండల కేంద్రాల మధ్య 2017లో తారు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అదే ఏడాది పనులు కూడా పూర్తయ్యాయి. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో వేసిన తారు రోడ్డు లేచిపోతుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఎస్సారెస్పీ వద్ద ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం శంకుస్థాపనకు రావడంతో జాతీయ రహదారి 44 పై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ట్రాఫిక్‌ను మళ్లిస్తూ ఈ రోడ్డు గుండా పెద్ద పెద్ద వాహనాలకు అనుమతి ఇచ్చారు. దీంతో అదే సమయంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై ఏర్పడ్డ గుంతలకు కాంట్రాక్టర్ స్వల్ప మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకొన్నారు. ఫలితంగా గుంతలమైన రోడ్డుపై ప్రయాణించాలంటనే ప్రయాణికులు జంకుతున్నారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు వీటి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసినా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో నిర్మించిన రోడ్డు కావడంతో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రోడ్డు గుండా వెళ్తూనే 2018లో ఘోర ప్రమాదం సంభవించింది. రోడ్డు సమీపంలోని బావిలో ఆటో పడడంతో అందులో ఉన్న 11 మంది జల సమాధి అయ్యారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సంబంధిత ఉన్నతాధికారులు గుంతలమైన రోడ్డు త్వరగా బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోడ్డు మరమ్మతుల విషయమై పలుమార్లు పంచాయతీ రాజ్ శాఖ అధికారులను సాక్షి ఫోనులో సంప్రదించగా స్పందించలేదు.

ఆలయంలో యజ్ఞం

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని ఆదినాథ స్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం యజ్ఞ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు జెండా కృష్ణపంతులు, పూజారి కోటపల్లి శశికాంత ఆధ్వర్యంలో యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నసేవ, హనుమంతుని సేవ జరిపారు. వీడీసీ సభ్యులు ముస్కు సాయరెడ్డి, బూస గంగారెడ్డి, చెంగల దేవదానం పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	హ్యాపీడేస్ - 01.30 పారిజాతపర్వం - 4.50, లవ్ యూ శంకర్ - 7.45, మార్కెట్ మహాలక్ష్మి - 10.25
స్క్రీన్-2 –	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 12.00, 3.00, 06.00, 9.00
స్క్రీన్-3 –	ది ఫ్యామిలీ స్టార్ -12.10, 6.40 గీతాంజలి మళ్లీ వచ్చింది - 3.25, టినెంట్ (తెలుగు)- 10.05
స్క్రీన్-4 –	మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)- 12.45, 3.45, 6.45, 9.54

బీజేపీ నాయకుల ప్రచారం



ఆర్మూర్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను గెలిపించాలని కోరు తూ పార్టీ నాయకులు పట్టణ కేంద్రంలోని 12 వార్డు లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్ మాట్లాడుతూ.. బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతుందని అన్నారు. ప్రచారంలో శక్తి కేంద్ర ఇంచార్జ్ ఉదయ్‌గౌడ్, కౌన్సిలర్ ఆకు ల శ్రీనివాస్, నాయకులు నూతల శ్రీనివాస్ రెడ్డి, జాగిర్దర్ శ్రీనివాస్, శేషగిరి లింగం, దొడ్ల నారాయణ, ఆరె రాజేశ్వర్, మందుల పోశెట్టి, పవన్, అనిల్, విజయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.